## మైండ్ స్పేస్ రీట్ దూకుడు

- హైదరాబాద్‌లో 18 లక్షల చ.అ.ఆఫీస్ స్పేస్ కొనుగోలు

న్యూఢిల్లీ, జనవరి 29: రియల్టీ సేవల సంస్థ మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో 18.2 లక్షల చదరపు అడుగుల కమర్షియల్ స్థలాన్ని రూ.613 కోట్లతో కొనుగోలు చేసింది. సస్టైన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఈ కమర్షియల్ స్థలంలో 100 శాతం వాటాను కొనుగోలు చేయబోతున్నట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఈ కొనుగోలు ఒప్పందానికి కంపెనీ బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరం మూడో త్రైమాసికంలో సంస్థ నికర నిర్వహణ ఆదాయం 8 శాతం ఎగబాకి రూ.521.8 కోట్లకు ఎగబాకింది.

# ఆల్‌టైమ్ హైకి బంగారం ధర




న్యూఢిల్లీ, జనవరి 29: బంగారం ధరలు ఆల్‌టైమ్ హైని చేరాయి. బుధవారం ఒక్కరోజే దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.910 ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,750గా నమోదైంది. జ్యుయెల్లర్స్, రిటైలర్ల నుంచి పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరగడంతో బహిరంగ మార్కెట్‌లో తొలిసారి పసిడి రేట్లు ఈ స్థాయికి చేరాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నది. నిజానికి వరుసగా 8 రోజులపాటు పుంజుకున్న గోల్డ్ రేట్లు.. రెండు రోజులుగా పడిపోయాయి. అయితే మళ్లీ పరుగులు పెట్టడంతో బులియన్ మార్కెట్‌లో సరికొత్త రికార్డు ధర పలికింది. కిలో వెండి ధర కూడా రూ.1,000 ఎగబాకి రూ.93,000లకు చేరింది.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్ మార్కెట్‌లోనూ బంగారం ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ తులం రూ.920 అందుకుని రూ.82,850గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.850 పెరిగి రూ.75,950ని తాకింది. ఇదిలావుంటే ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో ఫిబ్రవరి డెలివరీకిగాను గోల్డ్ కాంట్రాక్ట్స్ తులం రూ.80,517 పలికింది. మార్చి డెలివరీకి వెండి కిలో రూ.91,156గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ 2,794.70 డాలర్లుగా ఉన్నది. వెండి 30.99 డాలర్లుగా నమోదైంది.

**ఫెడ్ రిజర్వ్‌పై ఆధారం**

రాబోయే ద్రవ్యసమీక్షలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల విషయంలో ప్రదర్శించే వైఖరి.. గోల్డ్ మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేయవచ్చన్న అంచనాలున్నాయి. వడ్డీరేట్లు తగ్గితే బంగారం ధరలు మరింత పరుగులు పెడుతాయని చెప్తున్నారు. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్వుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్న సంగతి విదితమే. దీంతో మార్కెట్లు పడిపోయినకొద్దీ ఇన్వెస్టర్లు సురక్షిత మదుపు సాధనం బంగారం దిశగా తమ పెట్టుబడులను మళ్లించే వీలుందని, అప్పుడు రేట్లు ఇంకా పెరుగుతాయని కూడా విశ్లేషిస్తున్నారు.



# ఈవీలదే భవిష్యత్తు

**ప్రతీ 10 మందిలో ఆరుగురు ఎలక్ట్రిక్ వెహికిల్స్‌నే కొనేందుకు మొగ్గు**

**టీసీఎస్ అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి**

న్యూఢిల్లీ, జనవరి 29: భారత్‌సహా వివిధ దేశాల్లో విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ)దే భవిష్యత్తు అని ఓ అంతర్జాతీయ అధ్యయనం చెప్తున్నది. దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) చేపట్టిన సర్వేలో ప్రతీ 10 మందిలో ఆరు లేదా ఏడుగురు (సర్వేలో పాల్గొన్న 64 శాతం మంది) తాము కొనాలనుకునే లేదా కొనబోయే తదుపరి వాహనం ఎలక్ట్రిక్ వెహికిలేనని చెప్పడం గమనార్హం. అయితే 60 శాతం మంది ఈవీలకు చార్జింగ్ సదుపాయాల కొరత వేధిస్తున్నదని అభిప్రాయపడ్డారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్, స్విట్జర్లాండ్, చైనా, ఇండియా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ దేశాల్లో 'టీసీఎస్ ఫ్యూచర్-రెడీ ఈమొబిలిటీ స్టడీ 2025' పేరిట ఈ సర్వే జరిగింది. వాహనదారులతోపాటు రవాణా, చార్జింగ్ ఇన్‌ఫ్రా తదితర రంగాలవారు కూడా పాల్గొన్నట్టు టీసీఎస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా సుమారు రూ.35 లక్షల (40వేల డాలర్లు)తో ఓ ఈవీని కొనేందుకు సిద్ధంగా ఉన్నామని 56 శాతం మంది తెలిపారు.

**ఇలా చేస్తే అమ్మకాలు..**

మెరుగైన బ్యాటరీ టెక్నాలజీ, వేగంగా చార్జింగ్, ఆకర్షణీయ డిజైన్, ఎక్కువ మైలేజీ వంటివి ఈవీల కొనుగోళ్లను ఇంకా పెంచగలవని ఈ అధ్యయనంలో పాల్గొన్న 90 శాతం తయారీదారులు అభిప్రాయపడ్డారు. అలాగే వీరిలో 74 శాతం మంది ఈవీ మార్కెట్ వృద్ధికి ప్రధాన అవరోధంగా చార్జింగ్ సదుపాయాల కొరతేనని పేర్కొన్నారు. చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాగుంటే సేల్స్ దూసుకుపోతాయన్న నమ్మకాన్ని కనబర్చారు. 60 శాతం మంది వాహన వినియోగదారులూ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. చార్జింగ్ పాయింట్లు పెంచాల్సి ఉందన్నారు. ఇక అమెరికాలో 72 శాతం మంది ఈవీల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. సింగిల్ చార్జింగ్‌పై 200-300 కిలోమీటర్ల శ్రేణిలో మైలేజీ ఇచ్చే ఈవీలను కొంటామని 41 శాతం మంది చెప్తున్నారు.

# క్రిప్టో లావాదేవీలపై టీడీఎస్ తగ్గాలి

**సరళతర పన్ను నిర్మాణాలను తేవాలి • బడ్జెట్‌పై డిజిటల్ ఇండస్ట్రీ డిమాండ్**




న్యూఢిల్లీ, జనవరి 29: ఈసారి బడ్జెట్‌లో పన్ను నిర్మాణాల సరళతరంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని భారతీయ క్రిప్టోకరెన్సీ ఇండస్ట్రీ కోరుతున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను శనివారం (ఫిబ్రవరి 1) పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ క్రమంలో స్పష్టమైన రెగ్యులేటరీ నిబంధనలు తేవాలని, పన్నుల భారాన్ని తగ్గించాలని ఇండస్ట్రీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అప్పుడే డిజిటల్ ఆస్తుల రంగంలో బలమైన వృద్ధికి వీలుంటుందని చెప్తున్నారు.

**ఇదీ సంగతి..**

ప్రస్తుతం భారతీయ క్రిప్టో మార్కెట్.. అదృశ్య కరెన్సీ ఆస్తుల నుంచి వచ్చే మూలధన లాభాల (క్యాపిటల్ గెయిన్స్)పై 30 శాతం పన్నును ఎదుర్కొంటోంది. అలాగే అన్ని క్రిప్టో లావాదేవీలపై 1 శాతం ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్)ను చెల్లించాల్సి వస్తున్నది. దీంతో టీడీఎస్‌ను 0.01 శాతానికి పరిమితం చేయాలని, తద్వారా విదేశీ ఎక్స్ఛేంజీలకు ఇక్కడి నుంచి తరలిపోయే మూలధనం తగ్గుతుందని ఇండస్ట్రీ చెప్తున్నది. కాగా, క్రిప్టో ఆస్తుల కోసం ఓ పక్కా లీగల్ ఫ్రేమ్‌వర్క్ ఉండాలని కూడా ఇండస్ట్రీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈసారి బడ్జెట్‌లో ఆ దిశగా ఓ నిర్ణయం వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇక బ్లాక్‌చైన్, వెబ్3 స్టార్టప్‌లకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలుంటే భారీగా పెట్టుబడులు రావచ్చన్న అంచనాలున్నాయి.

**ఎస్ఎంఈలకు చేయూతనివ్వాలి**

ఎస్ఎంఈలకు బడ్జెట్‌లో చేయూతనివ్వాలని ఆ కంపెనీలు కోరుతున్నాయి. ఏఐ తదితర టెక్నాలజీలను అందిపుచ్చుకునేలా పన్ను ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తయారీ జోన్లు, క్రెడిట్ గ్యారంటీ స్కీములు అవసరమని చెప్తున్నారు.



## ఓలా మరో 3 ఈ-స్కూటర్లు

న్యూఢిల్లీ, జనవరి 29: ఓలా.. మరో మూడు నయా స్కూటర్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. 31న జనరేషన్ 3 స్కూటర్లను పరిచయం చేయబోతున్నట్టు కంపెనీ ఫౌండర్ భావిష్ అగర్వాల్ వెల్లడించారు. అధిక పనితీరు, మరిన్ని ఫీచర్స్, నూతన డిజైనింగ్ కోరుకుంటున్నవారికి ఈ నయా స్కూటర్లు సరైనవని తెలిపారు.

# ఐటీ షేర్ల మద్దతుతో..

**లాభాల్లో స్టాక్ మార్కెట్లు • సెన్సెక్స్ 632, నిఫ్టీ 206 పాయింట్లు వృద్ధి**



ముంబై, జనవరి 29: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 631.55 పాయింట్లు లేదా 0.83 శాతం పెరిగి 76వేల మార్కును దాటి 76,532.96 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 698.32 పాయింట్లు పుంజుకున్నది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 205.85 పాయింట్లు లేదా 0.90 శాతం ఎగిసి 23వేల స్థాయికి ఎగువన 23,163.10 వద్ద నిలిచింది.

**మెరిసిన ఐటీ, రియల్టీ షేర్లు**

ఐటీ, రియల్టీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 3.10 శాతం పెరిగింది. ఇండస్ట్రియల్స్ 2.94 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.70 శాతం ఐటీ 2.65 శాతం, కమోడిటీస్ 2.30 శాతం, హెల్త్‌కేర్ 2.20 శాతం చొప్పున పెరిగాయి. ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు మాత్రం నష్టపోయాయి. జొమాటో షేర్ విలువ గరిష్ఠంగా 7 శాతం ఎగబాకింది. టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లూ లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 2.54 శాతం, స్మాల్‌క్యాప్ 3.28 శాతం పెరిగాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు లాభాల్లో ముగిశాయి.

**నిరాశపర్చిన ఐటీసీ హోటల్స్**

ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ షేర్లు నిరాశపర్చాయి. మాతృ సంస్థతో విడిపోయి స్టాక్ ఎక్స్ఛేంజీల్లోకి బుధవారమే ప్రవేశించిన ఈ సంస్థ షేర్లు.. తొలిరోజే 5 శాతం వరకు నష్టాలను చవిచూశాయి. రూ.188 వద్ద లిస్టింగ్ అవగా, బీఎస్ఈలో రూ.178.60 వద్ద, ఎన్ఎస్ఈలో రూ.171.85 వద్ద నిలిచాయి.

## అప్పుడే వృద్ధి సాధ్యం

- భారత ఆర్థిక, ద్రవ్య విధానాలు మారాలన్న మూడీస్

న్యూఢిల్లీ, జనవరి 29: ఈ ఏడాది దేశ జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతాన్ని అందుకోవాలంటే భారత ఆర్థిక, ద్రవ్య విధానాలు మారాల్సిన అవసరం ఉన్నదని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అభిప్రాయపడింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి భారీగా తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల నడుమ ఇది ఎంతో ముఖ్యమని బుధవారం మూడీస్ అనలిటిక్స్ పేర్కొన్నది. కాగా, రాబోయే బడ్జెట్‌లో దేశీయ వినిమయ సామర్థ్యం పెంపునకు దోహదపడే నిర్ణయాలుంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

# మారుతీ సుజుకీ లాభం 3,727 కోట్లు




న్యూఢిల్లీ, జనవరి 29: దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ ఏకీకృత నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో గతంతో పోల్చితే 16 శాతం ఎగిసి రూ.3,727 కోట్లుగా ఉన్నది. మునుపు రూ.3,207 కోట్లేనని సంస్థ ప్రకటించింది. మొత్తం ఆదాయం కూడా రూ.33,513 కోట్ల నుంచి రూ.38,764 కోట్లకు ఎగిసింది. వాహన అమ్మకాలు పెరగడమే కారణమన్నది. ఇదిలావుంటే సుజుకీ మోటర్ గుజరాత్ విలీనానికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే మరో మూడేండ్లు కంపెనీ ఎండీ, సీఈవోగా ఉండేందుకు హిసాషి టకూచీకి లైన్ క్లియరైంది.

**టాటా మోటర్స్**

దేశీయ ఆటో రంగ సంస్థ టాటా మోటర్స్ ఏకీకృత నికర లాభం అక్టోబర్-డిసెంబర్‌లో 22 శాతం పడిపోయి రూ.5,578 కోట్లకు పరిమితమైంది. 2023-24 ఇదే త్రైమాసికంలో రూ.7,145 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని అందుకున్నది. అయితే ఏకీకృత ఆదాయం రూ.1,10,577 కోట్ల నుంచి రూ.1,13,575 కోట్లకు పెరిగినట్టు బుధవారం సంస్థ తెలియజేసింది. అయినప్పటికీ ప్యాసింజర్, కమర్షియల్ వాహన విక్రయాల ద్వారా ఆదాయం తగ్గినట్టు పేర్కొన్నది.

**అదానీ పవర్**

గౌతమ్ అదానీకి చెందిన అదానీ పవర్ ఏకీకృత నికర లాభం డిసెంబర్‌తో ముగిసిన 3 నెలల కాలంలో రూ.2,940 కోట్లుగా నమోదైంది. గతంతో పోల్చితే 7 శాతం పెరిగింది. ఏకీకృత ఆదాయం కూడా 11 శాతం పుంజుకొని రూ.14,833 కోట్లుగా ఉన్నది.

**ఇండియన్ బ్యాంక్**

ఇండియన్ బ్యాంక్ నికర లాభం అక్టోబర్-డిసెంబర్‌లో గతంతో పోల్చితే 35 శాతం పెరిగి రూ.2,852 కోట్లుగా నమోదైంది. ఆదాయం రూ.16,099 కోట్ల నుంచి రూ.17,912 కోట్లకు చేరింది.

చిత్రం

# పారితోషికం పెంచిందా?



దక్షిణాదిలో సాయిపల్లవికి అగ్ర హీరోలతో సమానమైన ఇమేజ్ ఉంది. అభిమానగణం కూడా ఎక్కువే. గత ఏడాది 'అమరన్' సినిమాలో సాయిపల్లవి నటనకు సర్వత్రా ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రం మూడొందల కోట్లకుపైగా వసూళ్లను సాధించి ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తన పారితోషికాన్ని భారీగా పెంచిందని తమిళ మీడియాలో వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ భామ తెలుగులో 'తండేల్'తో పాటు బాలీవుడ్‌లో రెండు చిత్రాల్లో నటిస్తున్నది. 'అమరన్' చిత్రానికి మూడుకోట్ల పారితోషికం అందుకున్న ఆమె..'తండేల్'కు ఐదు కోట్లు స్వీకరించిందని ప్రచారం జరుగుతున్నది. ఈ వార్తల్లో నిజానిజాలు ఎలా ఉన్నా సాయిపల్లవి గురించి బాగా తెలిసిన వారు మాత్రం ఆమెకు రెమ్యునరేషన్ పట్టింపులు అస్సలు ఉండవని చెబుతారు. సినిమాల విషయంలో మంచి కథలు, పాత్రలకే అధిక ప్రాధాన్యం ఇస్తుందని, పారితోషికం విషయంలో డిమాండ్ చేసిన సందర్భాలు లేవన్నది ఇండస్ట్రీ మాట. 'పడి పడి లేచె మనసు' సినిమా ఫెయిల్యూర్ కావడంతో ఆమె తన పారితోషికాన్ని కూడా వదులుకుందని అంటారు. సాయిపల్లవి నాగచైతన్యతో కలిసి నటించిన 'తండేల్' ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది.

# రాజమౌళి సినిమాలో విలన్‌గా?



రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా పాన్ వరల్డ్ అడ్వెంచరస్ మూవీ తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే హైదరాబాద్‌లో షూటింగ్ మొదలైంది. ఈ సినిమాలో వివిధ భారతీయ భాషలకు చెందిన అగ్రతారలతో పాటు హాలీవుడ్ స్టార్స్ కూడా నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ముఖ్యంగా ప్రతినాయకుడి పాత్రను ఎవరు పోషిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. రాజమౌళి తన సినిమాల్లో విలన్ పాత్రల్ని అత్యంత శక్తివంతులుగా చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో విలన్ క్యారెక్టర్ ఎవరనేది అభిమానుల్లో ఉత్సుకతను పెంచుతున్నది. మలయాళ అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటించనున్నారని ప్రచారం జరుగుతున్నది. తాజాగా ఈ వార్తలపై ఆయన స్పందించారు. 'ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అన్నీ ఫైనలైజ్ అయ్యాక చిత్రబృందం ఆ వివరాలను మీతో పంచుకుంటుంది' అని సమాధానమిచ్చారు. దీంతో ఆయన ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రను పోషించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. రాజమౌళి-మహేష్‌బాబు సినిమాలో విలన్‌గా బాలీవుడ్ నటుడు జాన్‌అబ్రహమ్ పేరును కూడా పరిశీలిస్తున్నారని మంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది.



## బ్యాచిలర్స్ జాలీ లైఫ్

సందీప్‌కిషన్, రీతూవర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'మజాకా'.త్రినాథరావు నక్కిన దర్శకుడు. రాజేష్ దండ నిర్మాత. ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో జోరు పెంచారు. బుధవారం బ్యాచిలర్ యాంథమ్ పాటను విడుదల చేశారు. బ్యాచిలర్స్ జీవితంలో ఉండే సరదాలు, కష్టాలను ఈ పాటలో చూపించారు. లియోన్ జేమ్స్ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రచించారు. ధనుంజయ్ సీపాన ఆలపించారు. యువతను హుషారెత్తించే గీతమిదని, వైజాగ్ బీచ్‌లో ఈ పాటను తెరకెక్కించామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కథ, కథనం, సంభాషణలు: ప్రసన్నకుమార్ బెజవాడ, నిర్మాతలు: రాజేష్ దండ, ఉమేష్ కేఆర్ బన్సల్, దర్శకుడు: త్రినాథరావు నక్కిన.

# ఫిబ్రవరిలో యాక్షన్ షురూ



ఎన్టీఆర్ కథానాయకుడిగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్స్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్తుందని తెలిసింది. ఎన్టీఆర్‌ను అత్యంత శక్తివంతంగా ఆవిష్కరిస్తూ ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని చెబుతున్నారు. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. త్వరలో టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశముంది. ఇదిలావుండగా ఎన్టీఆర్- హృతిక్‌రోషన్ నటిస్తున్న మల్టీస్టారర్ 'వార్-2' షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకురానుంది.



## మార్షల్ ఆర్ట్స్‌తో 'సంహారం'

ఆదిత్య, కవిత మహతో జంటగా నటించిన చిత్రం 'సంహారం'. స్వీయ దర్శక నిర్మాణంలో ధర్మ రూపొందించారు. ఈ నెల 31న విడుదలకానుంది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఓ అమ్మాయి మార్షల్ ఆర్ట్స్ సహాయంతో తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ఎలా ఎదుర్కొంది? దుష్టులను ఎలా సంహరించిందన్నదే కథాంశమని, అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ అవశ్యమనే అంశాన్ని చూపించామని దర్శకనిర్మాత ధర్మ పేర్కొన్నారు.

## కలియుగ మార్కండేయ



తేజస్, రోమి, దేవిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' ఉపశీర్షిక. బన్నీ అశ్వంత్ దర్శకుడు. సామా శ్రీధర్, పంజల వెంకట్ గౌడ్ నిర్మాతలు. ఇటీవల ఆడియోను విడుదల చేశారు. సత్యదీప్ సంగీతాన్నందించాడు. ఈ కార్యక్రమానికి సీనియర్ హీరో సుమన్, ప్రతాని రామకృష్ణగౌడ్ అతిథులుగా హాజరయ్యారు. నేటి యుగంలో శివుడి భక్తుడైన మార్కండేయ జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి? వాటిని శివుడి అనుగ్రహంతో ఎలా అధిగమించాడన్నదే చిత్ర కథాంశమని దర్శకుడు తెలిపారు.

## యాక్షన్ థ్రిల్లర్ 'మిస్టీరియస్'



అబిద్ భూషణ్, రోహిత్ సహాని, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకుడు. జయ్ వల్లందాస్ నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదలకానుంది. సస్పెన్స్, మిస్టరీ థ్రిల్లర్ కథాంశమిదని, సినిమాలోని ప్రతీ పాత్ర మిస్టీరియస్‌గా కనిపిస్తుందని దర్శకుడు తెలిపారు. త్వరలో పాటల్ని విడుదల చేస్తామని, రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి పాటలు, సంగీతం: ఎమ్ఎల్ రాజా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మహి కోమటిరెడ్డి.



## 'పరాశక్తి' ప్రతీకారం

విభిన్న కథాంశాలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటారు హీరో విజయ్ ఆంటోని. తాజాగా ఆయన నటిస్తున్న 25వ చిత్రాన్ని ప్రకటించారు. 'పరాశక్తి' అనే పేరుతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. ఈ సందర్భంగా బుధవారం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అరుణ్ ప్రభు ఈ చిత్రానికి దర్శకుడు. 'హృదయానికి హత్తుకునే కుటుంబ కథతో తెరకెక్కించబోతున్నాం. మాస్, అంశాలతో ఆకట్టుకుంటుంది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో భారీ వ్యయంతో తెరకెక్కించబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు. వాగై చంద్రశేఖర్, సునీల్‌కృష్ణ, సెల్‌మురుగన్, తృప్తి రవీంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: షెల్లీ కాలిస్ట్, సంగీతం: విజయ్ ఆంటోని, రచన-దర్శకత్వం: అరుణ్‌ప్రభు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.